క్లుప్తంగా

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కాజులూరు: ప్రశ్నపత్రాల రూపకల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మండల యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. కాజులూరులో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు భానుప్రకాశ్, ప్రధాన కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ బుధవారం సమ్మేటివ్ వన్ రెండో తరగతి ప్రశ్నపత్రంలో అందించిన దేశ చిత్రపటంలో కాశ్మీర్లో కొంత భాగాన్ని తగ్గించి చిత్రపటం అందించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా నిర్లక్ష్యంగా ప్రశ్నపత్రం తయారు చేయడం నేరమన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మండపేట: స్థానిక ఏడిద రోడ్డులోని శ్రీవేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్, సంస్కృతం సబ్జెక్టుల గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ కె.అప్పలరాజు బుధవారం తెలిపారు. ఆసక్తి, అనుభవం, అర్హతలు కలిగిన అభ్యర్థులు పూర్తి బయోడేటాతో కూడిన తమ దరఖాస్తులను ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ముగిసిన సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు



అంగర సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, కపిలేశ్వరపురం, కాలేరు తదితర గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. అంగరలోని వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శ్రీపుష్పోత్సవం పూజలు చేశారు. వేద పండితులు మంత్రోచ్ఛరణలతో ఉత్సవ ప్రాంగణం మారుమోగింది. స్వామిని విశేషంగా అలంకరించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె



సమ్మె చేస్తున్న మున్సిపల్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది

మండపేట: తమ డిమాండ్ల సాధనకు మండపేట మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది చేపట్టిన సమ్మె బుధవారం మూడో రోజుకు చేరింది. అవుట్ సోర్సింగ్ సిబ్బంది మండపేట పురపాలక సంఘ కార్యాలయం ఎదురుగా టెంట్ వేసుకుని కూర్చుని నిరసన తెలుపుతున్నారు. ప్రభుత్వం తమపై కనికరం చూపాలని వేడుకుంటున్నారు.కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు యాదాల తాతారావు, కోశాధికారి టీకే వెంకన్న, సభ్యులు పాలపర్తి సురేష్ కన్నా, కప్పల సురేంద్ర, పిట్టా ప్రవీణ్‌కుమార్, గంధం మధు, గంటి నవీన్ కుమార్, సవరపు సంతోష్, గుండుపల్లి ప్రసాద్, తలాటి వెంకన్న పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు



సోమేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో వేంచేసి ఉన్న సోమేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయం బుధవారం లెక్కించారు. ఈ కార్తిక మాసంలో స్వామివారి హుండీల ఆదాయం రూ.3.28 లక్షలు వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి జొన్నాడ భీమశంకరం విలేకరులకు తెలిపారు. గత ఏడాది కంటే రూ.41,121 అధికంగా ఆదాయం వచ్చిందని వివరించారు. లెక్కింపులో పలువురు భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అప్పనపల్లి ఆలయంలో లెక్కింపు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయంలో హుండీల ఆదాయం గురువారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు దేవదాయ, ధర్మదాయ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, స్థానికుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కిస్తామన్నారు. నిబంధనలకు అనుగుణంగా ఈ లెక్కింపు జరుగుతుందన్నారు.

నిర్లక్ష్యం వద్దు.. బీమా ముద్దు

- పంటల బీమా నమోదులో జాప్యం
- గడువు సమీపిస్తున్నా కానరాని చర్యలు
- ఈ నెల 31 ఆఖరు తేదీ



వర్షంలో మునిగిన వరి పంట (ఫైల్)

రామచంద్రపురం రూరల్: ఆరుగాలం శ్రమించి సాగు చేసే రైతు పంట చేతికొచ్చే సమయంలో అష్టకష్టాలు పడుతున్నాడు.. ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల సంభవించి తీవ్రంగా నష్టపోతున్నాడు. అలాంటి పరిస్థితుల్లో వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ యోజన అండగా నిలుస్తుంది. అయితే ఈ బీమా నమోదు నత్తనడకన జరుగుతుంది. ఇంకా రైతులు స్పందించకపోవడం వెనుక అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. అవగాహన కల్పించడంలో విఫలం అయ్యారని ఆరోపణలు వెల్లివెత్తుతున్నాయి. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షాన ఆలోచించి రైతు వాటాగా కట్టాల్సిన బీమా ప్రీమియాన్ని ఎప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే చెల్లించేలా నిర్ణయం తీసుకుని ఐదేళ్లు అమలు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వమే చెల్లించినప్పటికీ రబీ పంటకు మాత్రం రైతులే బీమా ప్రీమియం చెల్లించుకోవాలని వ్యవసాయ అధికారుల ద్వారా ప్రభుత్వం రైతులకు తెలియజేస్తోంది. ప్రీమియం కూడా రూ.630గా నిర్ణయించారు. రామచంద్రపురం రూరల్ మండలంలో 18,969, కె.గంగవరం మండలంలో 16,095, రాయవరం మండలంలో 15,009, మండపేట మండపేట మండలంలో 17,101, కపిలేశ్వరపురం మండలంలో 16,446 ఎకరాల విస్తీర్ణం ఉంది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఇంకా వరి నాట్లు పూర్తి కాలేదు. నాట్లు పూర్తయిన తరువాత ఈ–క్రాప్ నమోదు పూర్తి చేసి, పంటల బీమాకు ప్రీమియం కట్టడం జరుగుతుంది. కానీ ప్రభుత్వం పంటల బీమాకు డిసెంబరు 31 వరకూ మాత్రమే గడువు ఉందని ప్రకటించింది. దీనితో రైతులు హైరానా పడుతున్నారు.

కొరవడిన అవగాహన..

ఇదిలా ఉండగా గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో మాత్రమే వ్యవసాయ అధికారులు బీమా ప్రీమియం గురించి ప్రస్తావిస్తున్నారు. సీఎస్‌సీ సెంటర్లకు వెళ్లి బీమా ప్రీమియం చెల్లించాలని చెబుతున్నారే తప్ప ఏ ఏ సర్టిఫికెట్లు తీసుకు వెళ్లాలనే విషయంపై స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో రైతుల్లో అయోమయం నెలకొంది.

గడువు పెంచే అవకాశం ఉంది



ప్రస్తుతం వరి నాట్లు ఇంకా పూర్తి కాకపోవడంతో బీమా ప్రీమియం ఒక్కరూ చెల్లించకపోవడం వాస్తవమే. అయితే ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించడానికి గడువు పెంచే అవకాశం ఉందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

– ఎస్.సత్యప్రసాద్, వ్యవసాయ అధికారి, రామచంద్రపురం మండలం

ఎట్టకేలకు కేశవరం రోడ్డుకు మరమ్మతులు



కేశవరం రోడ్డులో ప్రారంభమైన మరమ్మతు పనులు

మండపేట: మండలంలోని కేశవరం గని పోతురాజు రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలుగుతోంది. బుధవారం ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఆర్నెల్లు కావస్తోంది. నియోజకవర్గంలో ఈ పాటికే ఈ పనులు చేపట్టాల్సి ఉండగా ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కాలయాపన జరిగింది. గని పోతురాజు చెరువు వద్ద నుంచి సంపత్‌నగరం వరకూ రోడ్డు గోతులతో మరీ అధ్వానంగా ఉంది. భారీ గోతులు ఏర్పడడంతో నిత్యం ఆ రోడ్డులో ప్రమాదాలు జరిగేవి. పోతురాజు ఆలయం వద్ద ఏర్పడిన భారీ గోతిలో పడి వాహనాల కింది ఇంజిన్ భాగాలు కూడా దెబ్బతినేవని వాహనదారులు గగ్గోలు పెట్టేవారు. రాత్రిపూట ఈ రహదారిపై ప్రయాణం సాహసమనే చెప్పాలి. ఈ రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ కేశవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు తుపాకుల ప్రసన్నకుమార్ తదితరులు ఆర్ అండ్ బీ, జిల్లా ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు మరమ్మతులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు, వాహనదారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఈ రహదారి మరమ్మతులను కాంట్రాక్టర్ బుధవారం కూలీలతో ప్రారంభించారు. కాగా అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించే నాథుడే కనిపించకపోవడం గమనార్హం.

ద్వారపూడిలో నేడు గని పోతురాజు విగ్రహ పునః ప్రతిష్ఠ



నూతన ఆలయంలో కొలువుతీరనున్న గనిపోతురాజు స్వామి విగ్రహం

మండపేట: ద్వారపూడి గ్రామంలో గురువారం గనిపోతురాజు స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గ్రామంలోని పాత కూరగాయల మార్కెట్ సమీపంలో పోతురాజు స్వామి ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. స్వామి వారిని గురువారం ప్రతిష్ఠించనున్నారు. స్వామివారికి బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, రుత్విక్ వరుణ, మండపారాధన వంటి పూజాదికాలు నిర్వహించారు. ఆలయం వద్ద గల రావిచెట్టుకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠకు ముందు ఆలయంలో అర్చకుడు సత్యవాడ వెంకటరమణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యుడు అడబాల బాబ్జి తెలిపారు. ద్వారపూడి అయ్యప్ప స్వామి దేవాలయం వ్యవస్థాపకుడు ఎస్ఎల్ కనకరాజు స్వామి చేతుల మీదుగా విగ్రహ పునఃప్రతిష్ఠ జరపనున్నట్టు వివరించారు. గురువారం ఉదయం హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేయనున్నట్టు బాబ్జి తెలిపారు.

ఉపాధి గ్రామ సభలు వాయిదా

కపిలేశ్వరపురం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన గ్రామ సభలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేసినట్టు ఉపాధి ఏపీఓ రవికిరణ్ తెలిపారు. ఉపాధి పనుల మండల స్థాయి సామాజిక తనిఖీ వేదిక నిర్వహణలో భాగంగా మండలంలోని గ్రామాల్లో బుధవారం నుంచి గ్రామసభలు నిర్వహించాల్సి ఉంది. ఉత్తర్వుల మేరకు బుధవారం తాతపూడి, కపిలేశ్వరపురం, నాగుల చెరువు గ్రామాల్లోని సభలు, గురువారం నిర్వహించాల్సిన అంగర, నల్లూరు గ్రామాల సభలను వాయిదా వేశామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు చెప్పాలనుకున్న విషయాలను ఈ నెల 21న కపిలేశ్వరపురంలో నిర్వహించ తలపెట్టిన మండల స్థాయ సామాజిక తనిఖీ వేదికలో విన్నవించుకోవాలని కోరారు. ఎన్నికల కోడ్ అడ్డంకి తొలగితే ఉన్నతాధికారులు ఆదేశాలపై ఈ నెల 14న వాకతిప్ప, పడమర ఖండ్రిక, నిడసనమెట్ట గ్రామాల్లో సభలను నిర్వహించనున్నామని ఏపీఓ తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికకు నోటిఫికేషన్



శలపాక సచివాలయంలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ అతికిస్తున్న అధికారులు

కాజులూరు: మండలంలోని గ్రామాల్లో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. శలపాక, గొల్లపాలెం, పెనుమళ్ల, కాజులూరు, మంజేరు, కోలంక, పల్లిపాలెం సంఘాలకు ఈ నెల 14న ఆదివారం ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఓటర్ల జాబితా తయారు చేసి గ్రామ సచివాలయాల్లో ఉంచిన అధికారులు బుధవారం ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికలు జరగనున్న అన్ని గ్రామ సచివాలయాల నోటీసు బోర్డులలో అతికించారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



తాళ్లపాలెం రామాలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపాలెంలో వేంచేసి ఉన్న రామాలయంలో బుధవారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను మాజీ ఎంపీపీ, శెట్టిబలిజ సంఘ నాయకుడు కట్టా సూర్యనారాయణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి హోమాలు, బుధవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ జరిగింది. మహిళా భజన బృందం భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్, సర్పంచ్ కట్టా గోవిందు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

కె.గంగవరం: మండలంలోని నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి తహసీల్దార్ బండి మృత్యుంజయరావు, ఇరిగేషన్ ఏఈ బీవీ సుబ్రహ్మణ్యంలు ఎన్నికల నోటిఫికేషన్‌లను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శనకు ఉంచారు. మండలంలో మొత్తం 6 నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు.

ముఖ్యమైన ప్రశ్నలపై గురి పెట్టాలి

- మార్చి 1 నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు
- విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న అధ్యాపకులు



అంగర కళాశాలలో చదువుకుంటున్న ఇంటర్మీడియెట్ విద్యార్థినులు

కపిలేశ్వరపురం: ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షల సమయం ఆసన్నమైంది. మార్చి 1 నుంచి ప్రథమ, 3వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులు థియరీ పరీక్షలు రాయనున్నారు. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. 90 శాతం సిలబస్ పూర్తికావడం, సమయం తక్కువగా ఉండడంతో సిలబస్‌లోని అతి ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో అధ్యాపకుల సూచనలు, సలహాలు ఇలా...

లాంగ్వేజీ సబ్జెక్టులపై దృష్టి సారించాలి



మొత్తం మార్కుల్లో లాంగ్వేజ్ సబ్జెక్టుల మార్కులు సైతం కలుస్తాయి. తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో గ్రామర్‌కు, ప్రశ్నా జవాబులకూ సమ ప్రాధాన్యం ఇవ్వాలి. మొదటి సంవత్సరంలో శ్మశాన వాటి, నందీశ్వరుని శాపం, కపాల మోక్షం, అప్పుడే పుట్టి ఉంటే, గాన సుభాకరుడు మంగళంపల్లి, కందుకూరి, కుంకుడాకు, ఎచ్చరిక పాఠాలను, సెకండియర్‌లోని శాంతి కాంక్ష, కర్మభూమిలో పూసిన ఓ పువ్వా, మన ఆటలు, వేమన కవిత్వంలపై దృష్టి సారించాలి.
పద్య, గద్య భాగాల్లోంచి వ్యాసరూప, ఉపవాచకం నుంచి 4 మార్కులు, అన్నింటి నుంచీ మూడు మార్కుల ప్రశ్నలొస్తాయి.

– డి.హేమచంద్, తెలుగు అధ్యాపకుడు, కపిలేశ్వరపురం

పూర్తి మార్కులు పొందే చాన్స్



అన్నింటికీ సమ ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా 75 మార్కులనూ పొందే అవకాశం ఉంది. మేథ్స్ 1ఎలో మాత్రికలు, ప్రమేయాలు, త్రికోణమితి, నిష్పత్తులు, పరివర్తనాలు, త్రిభుజ ధర్మాలు, సదిశల సంకలనం, సదిశల గుణకం, అతి పరావలయ ప్రమేయాలకు, 2ఎలో డీమూవర్స్ ధీరం, సంభావ్యత, యాదృశ్చిక చలరాశులు, ద్విపద సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– గుబ్బల రాంప్రసాద్, మేథ్స్ అధ్యాపకుడు, మండపేట

వ్యాసరూప ప్రశ్నలపై దృష్టి పెట్టాలి



ప్రథమ సంవత్సరంలో డోలనాలు, ఉష్ణగతిక శాస్త్రం, పని-శక్తి, సామర్థ్యం, పదార్థ ఉష్ణ ధర్మాల నుంచి ఎనిమిది మార్కుల ప్రశ్నలు వస్తాయి. ద్వితీయ సంవత్సరంలో కేంద్రకాలు, తరంగాలు, ప్రవాహ విద్యుత్ పాఠ్యాంశాల నుంచి వ్యాసరూప ప్రశ్నలు, మిగిలిన వాటి నుంచి 2, 4 మార్కుల ప్రశ్నలొస్తుంటాయి.

– చోడే రాంబాబు, ఫిజిక్స్ అధ్యాపకుడు, అంగర

కర్బన రసాయన శాస్త్రానికి ప్రాధాన్యం



ఫస్టియర్‌లో కర్బన రసాయన శాస్త్రం, మూలకాల వర్గీకరణ– ఉపవర్తన ధర్మాలు, పరమాణు నిర్మాణం, పర్యావరణ రసాయన శాస్త్రం సెకండియర్‌లో విద్యుత్ రసాయనశాస్త్రం– రసాయనిక గతికశాస్త్రం, పి.బ్లాక్ మూలకాలు, లోహ నిష్కర్షణలో సాధారణ సూత్రాలు, పాలిమర్‌లు, నిత్య జీవితంలో రసాయన శాస్త్రంలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– పి.రవికుమార్, కెమిస్ట్రీ అధ్యాపకుడు, తణుకువాడ

చిత్ర పటాలు విధిగా వేయాలి



బోటనీ ఫస్టియర్‌లో జీవ వైవిధ్యం, ప్రత్యుత్పత్తి విధానాలు, కణం నిర్మాణం, పుష్పించే మొక్కలలో లైంగిక ప్రత్యుత్పత్తి, మొక్కల నిర్మాణాత్మక సంవిధానం-స్వరూప శాస్త్రాల నుంచి అధిక మార్కులొచ్చే అవకాశం ఉంది. బోటనీ సెకండియర్‌లో వృక్ష శరీర ధర్మ శాస్త్రం, జీవ సాంకేతిక శాస్త్రం, మానవ సంక్షేమంలో మొక్కలు, సూక్ష్మ జీవులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

– చుక్కా సురేష్ కుమార్, బోటనీ అధ్యాపకుడు, యండగండి, కె.గంగవరం మండలం

ఎక్కువ మార్కులొచ్చే చాప్టర్లపై..



ప్రథమ సంవత్సరంలో రాజనీతి శాస్త్రం పరిధి స్వభావం, జాతి- జాతీయత, హక్కులు బాధ్యతలు, ప్రజాస్వామ్యం, ప్రభుత్వంలపై దృష్టి సారించాలి. ద్వితీయ సంవత్సరంలో భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు–ఆదేశిక సూత్రాలు, కేంద్ర కార్య నిర్వాహక శాఖ, కేంద్ర శాసన నిర్మాణ శాఖ, భారత దేశంలో స్థానిక ప్రభుత్వాలు, ఏపీ, భారతదేశంలో ఇటీవల పరిణాలపై దృష్టి సారించాలి.

–మేడపాటి తమ్మిరాజు, పౌరశాస్త్ర అధ్యాపకుడు, నదురుబాద, రాయవరం మండలం

అధిక మార్కులకు అవకాశం



ఫస్టియర్‌లో ఉమ్మడి కుటుంబం, సహకార సంఘాలు, వ్యాపార విత్తం మూలాధారాలు-2, తప్పుల సవరణ, సెకండియర్‌లో కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్, పార్టనర్ షిప్‌లో పదవీ విరమణ, మరణం ప్రాధాన్యం గలవి. వ్యాపార విత్తం మూలాధారాలు–2 నుంచి 17 మార్కులు, ఎంట్రప్రెన్యూర్ నుంచి 14 మార్కులు వచ్చే అవకాశం. ఫస్టియర్‌లో వ్యాపార వ్యవస్థ స్వరూపాలు, భాగస్వామ్య వ్యాపార సంస్థ, జాయింట్ స్టాక్ కంపెనీ స్థాపన, వ్యాపార విత్తం మూలాధారాలు–01, సూక్ష్మ, చిన్న మధ్య తరహా సంస్థలు, బహుళజాతి సంస్థలు, సెకండియర్‌లో వినియోగదారీ రక్షణ, ఫైనాన్షియల్ మార్కెట్, బిజినెస్ సర్వీసెస్, ఫంక్షన్స్ ఆఫ్ కమర్షియల్ బ్యాంకింగ్, ప్రిన్సిపల్స్ ఆఫ్ ఇన్సూరెన్స్‌లపై దృష్టి సారించాలి.

– ఎస్ఎస్‌వీ శ్రీనివాస్, కామర్స్ అధ్యాపకుడు, మండపేట

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కాజులూరు: కాజులూరు సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ ఏపీ ఈపీడీసీఎల్ డీఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం ప్రధాన సబ్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ 33/11 కేవీ సబ్ స్టేషన్లో మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ అంతరాయం ఉంటుందన్నారు. కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, శీల, శీలలంక, ఒంటితాడి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



శీలలో మాట్లాడుతున్న తహసీల్దార్ శివకుమార్

కాజులూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎల్.శివకుమార్ అన్నారు. బుధవారం శీలలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుల ద్వారా రీ సర్వేలో తలెత్తిన భూ హెచ్చుతగ్గులను సరిచేసుకోవచ్చన్నారు. మ్యూటేషన్, కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలు, రీసర్వే సమస్యలపై రైతులు ఫిర్యాదులు చేస్తే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఐ వేగేశ్వరరావు, సర్పంచ్ కోమలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 61 అర్జీలు



పామర్రులో సదస్సులో అర్జీలపై ఆరా తీస్తున్న ఆర్డీఓ అఖిల

రామచంద్రపురం: రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 61 అర్జీలు వచ్చాయని ఆర్డీఓ దేవరకొండ అఖిల తెలిపారు. కపిలేశ్వరపురం మండలంలో 7 అర్జీలు, కె.గంగవరం మండలంలో 26, రామచంద్రపురం మండలంలో 14, రాయవరం మండలంలో 14 అర్జీలు రాగా, మండపేట రూరల్ మండలంలో అర్జీలు రాలేదన్నారు.

దరఖాస్తులకు సకాలంలో పరిష్కారం

కపిలేశ్వరపురం: భూమి రికార్డుల సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో అందజేసిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకొంటున్నట్టు తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం వల్లూరులో రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. భూ సర్వే రికార్డుల్లోని సాంకేతిక సమస్యలను పరిష్కరించాలంటూ రైతులు దరఖాస్తులు అందజేశారు. సమస్యలపై వీఆర్వో తదితర గ్రామాధికారులు తహసీల్దార్‌కు వివరణ ఇచ్చారు. దరఖాస్తుల్లోని అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసి మీనాకుమారి, రెవెన్యూ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింహ గర్జన విజయవంతం చేయండి



కె.గంగవరంలో పోస్టర్లు చూపించి కార్యక్రమానికి ఆహ్వానిస్తున్న నాయకులు

కె.గంగవరం: గుంటూరులో ఈ నెల 15న నిర్వహించనున్న మాలల సింహ గర్జనను విజయవంతం చేయాలని మాల మహానాడు నాయకులు బుధవారం పిలుపునిచ్చారు. కె.గంగవరంలో పర్యటించి మాలల సింహ గర్జనకు వేలాదిగా తరలిరావాలని కరపత్రాలు, పోస్టర్లు అందించి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరావు, కోటి వెంకట్రావు, రవ్వా భూషణం, పెట్టా శ్రీనివాసరావు, జంగం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆబోతుకు దశదిన కర్మ



పడమటిపాలెంలో ఆబోతుకు దశదిన కర్మ చేస్తున్న గ్రామస్తులు

మలికిపురం: పడమటిపాలెంలో ఇటీవల మృతి చెందిన ఆబోతుకు గ్రామస్తులు దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. గత కొన్నేళ్లుగా ఈ గ్రామంలో ఉంటున్న ఆబోతు ఇటీవల అనారోగ్యంతో కాలం చేసింది. దీంతో ఆ గ్రామస్తులు పదో రోజైన బుధవారం దశదిన కర్మ నిర్వహించారు. అనంతరం సుమారు 500 మందికి అన్నదానం చేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి అల్లవరం గ్రామ వాస్తవ్యులు మూల లలిత, ఆమె కుటుంబ సభ్యులు బుధవారం రూ.20 వేల విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు వినాయకరావుకు ఇచ్చారు. దాతను సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. అలాగే కవల పిల్లలకు పటిక బెల్లం, చిల్లర నాణేలను తులాభారంగా సమర్పించారు.